క్లుప్తంగా

డిసెంబర్‌లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి

పలాస: ప్రధానమంత్రి ఆవాజ్‌యోజన్ పథకం కింద మంజూరైన ఇళ్లను ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీలోగా పూర్తి చేయాలని సోషల్ డెలప్‌మెంట్ స్పెషలిస్టు చెన్నూరు మల్లేశ్వరరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వివిధ దశల్లో ఆగిపోయిన ఇళ్లకు సంబంధించి ఎస్సీలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు ప్రభుత్వం అదనంగా అందజేస్తోందన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాల కోసం 99492 56501 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మంచినీటి కల్పనకు ప్రాధాన్యం



మోటారు బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని కవిటి ఎంపీపీ కడియాల పద్మ అన్నారు. లండారపుట్టుగ పంచాయతీ పొందూరుపుట్టుగలో రూ.1.50 లక్షల మండల పరిషత్ నిధులతో వేసిన విద్యుత్ మోటార్‌బోరు బావిని ఎమ్మెల్సీ నర్తు రామారావుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కడియాల ప్రకాష్ పాల్గొన్నారు.

రాఖీల సందడి..



కంచిలి: రాఖీలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



టెక్కలి రూరల్: రాఖీల విక్రయ షాపు వద్ద జనాల సందడి

కంచిలి/టెక్కలి రూరల్: సోదర భావానికి ప్రతీక రాఖీ పౌర్ణమి. ఈ సందర్భంగా అన్నలు, తమ్ముళ్లకు అక్కచెల్లెళ్లు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించడం సంప్రదాయం. శనివారం రాఖీ పౌర్ణమి కావడంతో రాఖీలు, మిఠాయిల విక్రయ దుకాణదారులు కొనుగోలుదారులతో శుక్రవారం రద్దీగా కనిపించాయి. టెక్కలి, కంచిలి పట్టణాల్లోని అన్ని జంక్షన్లలో ఉన్న విక్రయ కేంద్రాలు జనంతో రద్దీగా కనిపించాయి.

వేడుకలకు ఏర్పాట్లు పూర్తి



మార్కెట్ యార్డ్‌లో సభా ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

పాతపట్నం: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ ఎస్.ప్రసాదరావు, ఐటీడీఏ డీఈఈ శిమ్మయ్య, ఎంపీడీఓ చంద్రకుమారి తెలిపారు. శుక్రవారం సాయంత్రం పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మార్కెట్ యార్డుకు చేరుకుని, నిర్వహణ ఏర్పాట్లను అధికారులకు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రభుత్వ అధికారులు, గిరిజన నాయకులు కృషి చేయాలన్నారు. ఉదయం 9 గంటలకు పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ప్రధాన జాతీయ రహదారి మీదుగా మార్కెట్ యార్డ్ వరకు ర్యాలీ నిర్వహించనున్నామని గిరిజన నాయకులు తెలిపారు.

ఎట్టకేలకు కల్వర్టు నిర్మాణం

ఇచ్ఛాపురం రూరల్: కేశుపురం పంచాయతీ సన్యాసిపుట్టుగ గ్రామం సమీపంలోని తారు రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. చిన్నపాటి వర్షం కురిసినా సన్యాసిపుట్టుగ నుంచి వచ్చే వరద నీరు రోడ్డు మధ్యలో నిలిచిపోవడంతో వాహనదారులకు ఇబ్బందిగా ఉండేది. ఈ సమస్యపై పలుమార్లు 'సాక్షి'దినపత్రికలో వచ్చిన కథనాలకు అధికారులు స్పందించారు. ఎట్టకేలకు పంచాయతీ నిధులు రూ. ఏడు లక్షలతో రోడ్డు మధ్యలో కల్వర్టు నిర్మించడంతో సమస్య కొంతవరకు పరిష్కారమైంది. ప్రస్తుతానికి ఒకవైపు పనులు చేపట్టడం జరిగిందని, త్వరలో పూర్తిస్థాయిలో పనులు చేపడతామని సర్పంచ్ గుజ్జు ఢిల్లీరావు చెప్పారు.



సన్యాసిపుట్టుగ వద్ద రోడ్డు దుస్థితి(ఫైల్)



ఒకపక్క నిర్మించిన రోడ్డు



హుద్ హుద్ ఇళ్ల చుట్టూ పేరుకుపోయిన పిచ్చిమొక్కలు

హుద్‌హుద్ ఇళ్లు
అసౌకర్యాల లోగిళ్లు!

- కానరాని మౌలిక వసతులు
- పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు కేటాయించని గృహాలు
- చోరీకి గురవుతున్న సామగ్రి

టెక్కలి రూరల్:

హుద్‌హుద్.. ఈ పేరు వింటే ఇప్పటికీ చాలా మంది భయంతో వణికిపోతుంటారు. 2014 అక్టోబర్ 12వ తేదీ అర్ధరాత్రి నుంచి మరుసటి రోజు సాయంత్రం వరకూ ఉత్తరాంధ్రను వణికించిన పెను తుఫాన్‌తో వేలాది మంది నిరాశ్రయులు అయ్యారు. చాలామంది ఇళ్లను కోల్పోయారు. ఇలాంటి వారిని గుర్తించి వారికి ఇళ్లను నిర్మించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా డివిజన్ కేంద్రమైన టెక్కలిలో సుమారు రూ. పది కోట్లు వ్యయంతో 196 ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు శంకుస్థాపన చేశారు. అయితే తుఫాన్ ప్రళయం సృష్టించి సుమారు 11 సంవత్సరాలైనప్పటికీ హుద్‌హుద్ ఇళ్లకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించలేదు. దీంతో ఆ ఇళ్లల్లో ఉండేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీనికితోడు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు గృహాల కేటాయింపు చేయలేదు. ఇదిలా ఉండగా టెక్కలిలో రహదారి విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన పది కుటుంబాలకు హుద్‌హుద్ బాధితుల కోసం నిర్మించిన ఇళ్లను అధికారులు కేటాయించారు. అయితే వారు ఉండేందుకు సరైన మౌలిక వసతుల్లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్‌తోపాటు మంచినీరు లేక అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. అలాగే ఇళ్లచుట్టూ పిచ్చి మొక్కలు పేరుకుపోవడంతోపాటు నిత్యం దోమలు, పాములతో ఉన్న పది కుటుంబాలు భయపడుతున్నాయి.



ఓ ఇంటి ఆవరణలో మద్యం సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు



ధ్వంసమైన కిటికీ అద్దాలు

విలువైన వస్తువులు చోరీ

ఇళ్లను పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు కేటాయించలేదు. దీంతో ఇంటి గోడలు పగుళ్లు ఏర్పడ్డాయి. అలాగే ఖాళీగా ఉన్న ఇళ్లను అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకున్నారు. అలాగే ఇళ్లకు అమర్చిన తలుపులు, విద్యుత్ కోసం అమర్చిన సామగ్రి చోరీకి గురయ్యాయి. మంచినీటి సరఫరాకు కోసం సిద్ధం చేసిన ట్యాంకులు, ఇంటి కిటికీలను ధ్వంసం చేశారు.

గత ప్రభుత్వ హయాంలో..

గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా నాయకులు, అధికారులు ఇంటింటికీ వెళ్లి ఇళ్లు కట్టుకోలేని నిరుపేదలను గుర్తించి సుమారు 90 మంది లబ్ధిదారులకు లాటరీ పద్ధతిలో ఇళ్ల పట్టాలను అందజేయడంతోపాటు గృహాలను సైతం చూపించారు. వీరిలో కొంతమంది గృహ ప్రవేశాలు చేశారు. పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. అయితే ఇంతలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పరిస్థితులు మారిపోయాయి. కూటమి సర్కార్ బాధ్యతలు చేపట్టి సంవత్సరం దాటినప్పటికీ ఇళ్లపై కనీసం దృష్టి సారించలేదు. ఫలితంగా విలువైన ఇళ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

కరెంట్ లేక అవస్థలు..



మేము ఉంటున్న హుద్‌హుద్ ఇంటికి కరెంట్ లేక ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి సమయంలో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి. నిత్యం పాములు, దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. కనీసం మంచినీటి సౌకర్యం కూడా లేదు. ఇప్పటికైన అధికారులు, నాయకులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలి.

–బద్రీ నీలవేణి, హుద్‌హుద్ గృహ లబ్ధిదారు

చీకటి కార్యకలాపాలకు అడ్డా..



హుద్‌హుద్ ఇళ్లను పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు కేటాయించలేదు. దీంతో ఖాళీగా ఉన్న ఇళ్లను చాలా మంది చీకటి కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకుంటున్నారు. అలాగే ఇళ్లకు అమర్చిన తలుపులు, విద్యుత్ పరికరాలు చోరీకి గురవుతున్నాయి.

– కొల్లి నీలమ్మ, హుద్‌హుద్ గృహ లబ్ధిదారు



ఆకతాయిల చేతిలో ధ్వంసమైన నీటిట్యాంక్

లక్ష్మీదేవి నమోస్తుతే..

శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీదేవి వ్రతాలను భక్తిశ్రద్ధలతో వైభవంగా చేశారు. తెల్లవారుజాము నుంచే వివిధ ఆలయాలకు మహిళలు చేరుకొని సాముహిక కుంకుమార్చనలు, వ్రతాలు ఆచరించారు. లక్ష్మీదేవి, అమ్మవార్ల విగ్రహాలకు పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయాలను సుందరంగా అలంకరించారు. అలాగే ఇళ్లల్లో కూడా వరలక్ష్మి వ్రతాలను సంప్రదాయబద్ధంగా చేశారు. ప్రతి ఇంట లక్ష్మీదేవి ప్రతిమలను ప్రతిష్ఠించి, వాటికి వస్త్రాలు, పుష్పాలు, బంగారు నగలతో అలంకరించారు. వివిధ రకాల నైవేద్యాలు ఉంచి మొక్కులు చెల్లించుకున్నారు. ముత్తైదువులకు వాయినాలు అందించి ఆశీర్వచనాలు పొందారు.

–సాక్షి నెట్‌వర్క్



వజ్రపుకొత్తూరు రూరల్: పూజలు అందుకుంటున్న వరలక్ష్మీదేవి



మందస గ్రామ దేవత ఆలయం ప్రాంగణంలో మహిళల కుంకుమ పూజలు



ఇచ్ఛాపురం: స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో లలితా సహస్ర నామార్చనలో మహిళలు



కవిటి: లోళ్లపుట్టగ కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు



సోంపేట: ప్రత్యేక అలంకరణలో సోంపేట సోమపోలమాంబదేవి



కంచిలి: కర్తలిలో పూజలందుకుంటున్న మహాలక్ష్మమ్మ అమ్మవారు

హామీలపై నిలదీయండి

నందిగాం: అధికారంలోకి రావడం కోసం ఇచ్చిన హామీలు అమలుచేసేంత వరకు కూటమి నాయకులను నిలదీయాలని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావు ప్రజలను కోరారు. బోరుభద్ర గ్రామంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని సర్పంచ్ కవిటి ఎర్రన్న ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలు, అవి నెరవేర్చకపోవడం వలన ప్రతి కుటుంబం నష్టపోయిన ఆర్థిక సాయాన్ని వివరించారు. ఎన్నికల హామీలతో కూడిన క్యూఆర్ కోడ్ పత్రాలు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతు మాధవిలత, చిన్ని జోగారావు, కణితి నారాయణమూర్తి, తమిరె రాజు, అంబోడి విష్ణు, పైల కరుణాకర్, పేరాడ అనిల్‌కుమార్, పేరాడ శివ, బమ్మిడి సాంబమూర్తి, దివ్వల షణ్ముఖరావు, సంపదరావు, నరసింహమూర్తి, అప్పలరాజు, కర్రి కూరేసు, దడియాల రమణమూర్తి, కర్రి సోమేశు, పానిల అప్పలస్వామి, కణితి వాసు, కణితి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు మోసాలు వివరిస్తున్న ఎంపీపీ శ్రీరామమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు ఫాల్గుణరావు

బీసీలకు రుణాలు అందేనా?



రుణాల కోసం నిర్వహించిన ఇంటర్వ్యూకు హాజరైన లబ్ధిదారులు(ఫైల్)

- ఇంటర్వ్యూలే మిగిలాయి..
- ఆందోళనలో ఆశావాహులు

ఇచ్ఛాపురం రూరల్:

ఎన్నికల ప్రచార సమయంలో బీసీలకు కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేస్తామని కూటమి నాయకులు హామీలు గుప్పించారు. అందులో భాగంగా అధికారం చేపట్టిన తర్వాత హడావిడిగా రుణాల మంజూరు పేరుతో దరఖాస్తులు ఆహ్వానించి కొన్ని నెలల క్రితం ఇంటర్వ్యూలు కూడా నిర్వహించారు. ఆ తర్వాత రేపు..మాపు అంటూ నెలలు గడుస్తున్నా రుణాల జాడ లేదు. దీంతో ప్రభుత్వానికి రుణాలు ఇచ్చే ఉద్దేశం ఉందా లేదా అని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరుకు కూటమి ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారంలో మండలంలో 402 మందికి, మున్సిపాలిటీలో 327 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. అందులో రూ. రెండు లక్షల లోపు రుణాల కోసం 45 మంది, రూ. రెండు లక్షల నుంచి రూ. మూడు లక్షల రుణాలకు 330 మంది, రూ. మూడు లక్షల నుంచి రూ. 4.50 లక్షలకు 354 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. వ్యాపారం, వ్యవసాయం, కిరాణ, పశువుల పెంపకం తదితర 55 యూనిట్ల ద్వారా జీవనోపాధి మెరుగు పరుచుకోవచ్చని నోటిఫికేషన్‌లో ప్రభుత్వం పేర్కొంది. ఇందు కోసం ఇంటర్వ్యూలు నిర్వహించి నాలుగు నెలలు గడుస్తున్నా రుణాలు మంజూరు కాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

కూటమి నాయకులు అడ్డుపడుతున్నారా?

రుణాల మంజూరుకు కూటమి నాయకులు అడ్డుపడుతున్నారనే ఆరోపణలున్నాయి. రుణాలను కూటమి నాయకులు పంచుకోవడం, వారికి అనుకూలమైన వారికి ఇప్పించుకోవడంలో అధికారులపై ఒత్తిడి తెస్తుండటంతోనే కాలయాపన అవుతున్నట్లు సమాచారం. ఇంటర్వ్యూలు జరిపిన అధికారులు అర్హుల జాబితాను కూడా ప్రకటించకపోవడంతో ఈ అనుమానాలకు బలం చేకూరుతోందని పలువురు పేర్కొంటున్నారు.

ఎదురు చూస్తున్నా..

వ్యాపారం చేసుకుందామని రూ. ఐదు లక్షల రుణం కోసం దరఖాస్తు చేసుకున్నాను. ఏప్రిల్ మూడో తేదీన బ్యాంకర్లు నిర్వహించిన ఇంటర్వ్యూకు హాజరయ్యాను. అప్పటి నుంచి ఎదురుచూస్తున్నప్పటికీ అధికారుల నుంచి ఎలాంటి సమాచారం లేదు. టీడీపీ మద్దతుదారులకు మాత్రమే రుణాలు అందిస్తున్నట్లు తెలిసింది.

– ఎన్.ధనలక్ష్మి, సన్యాసిపుట్టుగ, ఇచ్ఛాపురం మండలం

ఉత్తర్వులు రాలేదు



బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు పూర్తి చేయడం జరిగింది. లబ్ధిదారుల వివరాలను ఉన్నతాధికారులకు పంపించాం. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉత్తర్వులు అందలేదు. ఆదేశాలు రాగానే రుణాల మంజూరు ప్రక్రియను ప్రారంభిస్తాం. అర్హులైన లబ్ధిదారులకు రుణాలు అందేలా చూస్తాం.

– కె.రామారావు, ఎంపీడీవో, ఇచ్ఛాపురం మండలం

నేడు మండల సమావేశం

పొందూరు: ఈ నెల 9వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ ఎం.మన్మధరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కిల్లి ఉషారాణి అధ్యక్షత వహిస్తారన్నారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు.

పని చేయని నిఘా నేత్రాలు!

- ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పాడైన సీసీ కెమెరాలు
- ప్రయాణికులకు భద్రత కరువు

టెక్కలి రూరల్: టెక్కలి ఆర్టీసీ బస్టాండ్ వద్ద కొన్ని నెలలుగా నిఘా కొరవడింది. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే కాంప్లెక్స్‌లోని సీసీ కెమెరాలు పని చేయడం లేదు. దీనికితోడు పర్యవేక్షణ లోపం కారణంగా జేబుదొంగలు, సెల్‌ఫోన్లు చోరీలు తరచూ జరుగుతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. కాంప్లెక్స్ అవరణలో నామమాత్రంగానే కెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే అవికూడా పని చేయడం లేదు. అంతే కాకుండా కాంప్లెక్స్ వెలుపల భాగంలో కెమెరాలు లేకపోవడంతో కాంప్లెక్స్ అవరణలో ఉన్న వాహనాలకు రక్షణ లేకుండా పోతుందని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. టెక్కలి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చే వందలాది మంది విద్యార్థులు, ప్రయాణికులతో రద్దీగా ఉండే కాంప్లెక్స్‌పై పోలీసుల నిఘా సైతం లేకపోవడంతో ఆకతాయిల అల్లర్లు సైతం పెరిగిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినుల పట్ల కొంతమంది అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ఉన్న సీసీ కెమెరాలకు మరమ్మతులు చేపట్టాలని, అలాగే అవసరమైన చోట కొత్తవి ఏర్పాటు చేయాలని, కళాశాలలు విడిచి పెట్టే సమయంలో పోలీసులు కాంప్లెక్ ఆవరణలో ఉంచి నిఘా పెంచాలని స్థానికులు కోరుతున్నారు.



కాంప్లెక్స్ ఆవరణలో పని చేయని సీసీ కెమెరా



టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్

ప్రభుత్వం దృష్టికి రైతుల సమస్యలు

ఇచ్ఛాపురం: రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్టు రైతు కుల సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ జన్నెల వరప్రసాద్ అన్నారు. పట్టణంలోని ఎల్లమ్మ ఆలయం ప్రాంగణంలో మున్సిపాలిటీ పరిధిలోని రైతులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 11 బాహుదా చానళ్లలో కేవలం ఒక్కదాన్ని మాత్రమే సరిచేశారని.. మిగిలిన వాటిని కూడా సరి చేయడంతో పాటు వంశధార, బాహుదా నదుల అనుసంధానం, కొళిగాం–పాయి తారికీర్తిపురం పంచాయతీలో లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు, ఈదుపురం వరదగట్టు నిర్మాణం గురించి స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సంఘ ప్రతినిధులు ఆశి జీవులు, దుర్గాసి పాపారావు, కూర్మారావు, బర్ల ప్రసాద్, సీహెచ్ లోహిదాస్, విశ్వనాథం, మేఘనాథ్ పాల్గొన్నారు.



రైతుల సమస్యలను వివరిస్తున్న సంఘం కన్వీనర్ వరప్రసాద్